క్లుప్తంగా

మాచవరంలో భారీ వర్షం



మాచవరం: అల్పపీడన ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో రహదారులు జలమయమయ్యాయి. వర్షం కురవడంతో రైతులు వేసవి దుక్కులు దున్నుకునేందుకు అనుకూలంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు చల్లటి వాతావరణం నెలకొంది. అధిక ఉష్ణోగ్రతలు తగ్గడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కూరగాయ, పండ్ల తోటలకు ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు భావిస్తున్నారు. పంట మార్పిడికి అనుకూలంగా కొందరు రైతులు పచ్చిరొట్ట పంటలు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

పిడుగురాళ్లలో...

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. నిన్న, మొన్నటి వరకు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు శని, ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం పొందారు. అదే విధంగా రైతులు సైతం భూమి దున్నుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రతి ఒక్కరూ ఏసు మార్గంలో నడవాలి



విజయపురిసౌత్: ప్రతి క్రైస్తవుడు తోటివారితో ప్రేమతో మెలగాలని సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు చిన్నాబత్తిని హృదయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సాగర్‌మాత దేవాలయంలో జరిగిన దివ్యబలిపూజా కార్యక్రమంలో ఆయన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ప్రతి క్రైస్తవుడు ఏసుక్రీస్తు మార్గంలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. దీనికి ముందు భక్తులు దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి తలనీలాలు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన తేరు ప్రదక్షిణలో పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



గురజాల : ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. గురజాల నగర పంచాయతీలోని బ్రహ్మనాయుడు విగ్రహం వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జరుగుతున్న గొడవలను దృష్టిలో ఉంచుకొని పోలీసులు ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సంబంధిత పత్రాలు చూపించిన తరువాతనే వాహనాలను పంపుతున్నారు. వాహనాలకు సరైన పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. సీఐ టి.బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐలు బి.అనంత కృష్ణ, సౌందర్‌రాజన్ సిబ్బంది ఉన్నారు.

చర్మకార సేవా సంఘం అధ్యక్షుడిగా అచ్యుతరావు



పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గ చర్మకార సేవా సంఘం అధ్యక్షుడిగా కంచర్ల అచ్యుతరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీ చర్మకార సేవా సంఘం అధ్యక్షుడు బుల్లా రాజారావు ఆదివారం ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. రెండున్నర సంవత్సరాలు పదవిలో కొనసాగుతారని తెలిపారు. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ డప్పు, చర్మకారులకు సహాయ సహకారాలు అందించి, అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

మండలంలో ప్రశాంత వాతావరణం

రాజుపాలెం: ఈనెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో మండలంలో కొన్ని గ్రామాలలో ఇరు వర్గాలకు ఘర్షణలు జరగడంతో ఆయా గ్రామాలలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అమీర్‌బాషా ఆదివారం తెలిపారు. పెదనెమలిపురి, ఉప్పలపాడు, గణపవరం గ్రామాలలో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ప్రశాంత వాతావరణం నెలకొంది అని ఆయన తెలియజేశారు. గ్రామాలలో ఎవరైనా రెచ్చగొట్టేలా మాట్లాడి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేమంతా ఓటు వేయం...!?

- నియోజకవర్గంలో 43,026 మంది ఓటుకు దూరం
- 2019లో 44,251 మంది ఓటర్లు దూరం
- అయినా పెరిగిన పోలింగ్ శాతం



బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

గురజాల : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో గురజాల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వేలాది మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగానికి దూరమయ్యారు. వీరికి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేక...? లేదా ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయో తెలియదు. గురజాల నియోజకవర్గంలో ఈ సారి పోలింగ్ శాతం పట్ల అటు రాజకీయపక్షాలు, ఇటు పరిశీలకులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రతి సారి ఎన్నికల్లో 40 వేలకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకుండా దూరంగా ఉండటం మాత్రం చర్చనీయాంశంగా మారింది. ఉపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు సాధారణ ఎన్నికల సమయంలో తమ సొంతూళ్లకు వెళ్లిపోతున్నారా లేదా ఓటింగ్‌లో పాల్గొనడం ఇష్టం లేదా వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పెరిగిన పోలింగ్ శాతం

నియోజకవర్గంలోని గురజాల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో 2,68,469 మంది ఓటర్లకు గాను 2,24,218 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 83.52 శాతం పోలింగ్ నమోదయింది. 2024లో 2,73,971 మంది ఓటర్లకు గాను 2,30,945 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 84.30 పోలింగ్ శాతం నమోదయింది. అయితే 2019 పోలిస్తే 2024లో జరిగిన ఎన్నికల్లో 0.78 శాతం ఓటింగ్ పెరిగిందనే చెప్పవచ్చు. ఓటర్ల సంఖ్య పెరగడమే పోలింగ్ శాతం పెరగడానికి కారణంగా తెలుస్తోంది. 2019లో 44,251 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. 2024లో 43,026 మంది ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు.

యథాస్థితికి చేరుకుంటున్న కారెంపూడి



ప్రజల రాకపోకలతో సందడిగా ఉన్న కారెంపూడి బస్టాండ్ సెంటర్

కారెంపూడి: కారెంపూడి ఆదివారం చాలా వరకు కుదటపడింది. 144 సెక్షన్ తొలగించడంతో ప్రజలు స్వేచ్ఛగా బయటకు వచ్చారు. దీంతో కారెంపూడి బస్టాండ్‌లో జనంతో సందడి వాతావరణం నెలకొంది. షాపులన్నీ తెరుచుకున్నాయి. 14వ తేదీ నుంచి ఐదు రోజులుగా కొనసాగిన టెన్షన్ తగ్గింది. 144 సెక్షన్‌ను అధికారులు ఎత్తివేయడంతో ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నారు. బందోబస్తును కూడా పోలీసులు తగ్గించారు. చెక్‌పోస్టులను ఎత్తేశారు. అయితే పోలీసులు వాహనాలలో తిరుగుతూ శాంతి భద్రతలను పరిరక్షిస్తున్నారు. 14వ తేదీన కారెంపూడిలో అల్లర్లు, దాడులు, వాహనాల దహనాలు చోటు చేసుకోవడంతో కారెంపూడి భయం గుప్పిట్లోకి వెళ్లింది. అప్పటి నుంచి ఐదు రోజులు కారెంపూడి నిర్మానుష్యంగా మారింది. అలాగే మండలంలోని గ్రామాలలో కూడా అభద్రతా భావంతో ప్రజలు టెన్షన్ పడ్డారు. అయితే అది ఇప్పుడిప్పుడే తొలగి ప్రజలు సాధారణ జీవనం గడపడం ప్రారంభించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



లక్ష్మీనరసింహ స్వామి



జంగమహేశ్వరపురంలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం

గురజాల : నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో వేంచేసియున్న పల్నాడు యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ కార్యక్రమం, పలు పూజలు నిర్వహించడం జరుగుతుంది. 21వ తేదీ మంగళవారం స్వామి వారి కల్యాణం, అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. కావున స్వామి వారి కల్యాణాన్ని తిలకించి భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. ప్రతి ఒక్కరూ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

విద్యుత్ ఎర్త్ వైరు తగిలి బాలుడికి తీవ్రగాయాలు



గాయాలపాలైన బాలుడు

వెల్దుర్తి: విద్యుత్ ఎర్త్ వైరు తగిలి ఓ బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గుండ్లపాడు గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వర్లు కుమారుడు యువరాజ్ వారి ఇంటి సమీపంలో స్నేహితులతో గోళీలు ఆడుకుంటున్న సమయంలో విద్యుత్ స్తంభానికి ఏర్పాటు చేసిన ఎర్త్ వైరు తాకటంతో యువరాజ్‌కు పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. యువరాజ్ కేకలు వేయటంతో సమీపంలో ఉన్న వారు బాలుడిని పక్కకు తీసి 108కు సమాచారమందించారు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని యువరాజ్‌ను మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు యువరాజ్‌కు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. ఈ ఘటనపై వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

నాదెండ్ల: శాఖా గ్రంథాలయాల నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నాదెండ్ల గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు కోరారు. మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి జూన్ 7వ తేదీ వరకు 24 రోజుల పాటూ విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజూ విద్యార్థులకు రాయటం, చదవటం, చదివించటం, గణితం, తెలుగు, ఇంగ్లిష్ తదితర అంశాల్లో ప్రత్యేక కార్యక్రమాలతో శిక్షణనిస్తామన్నారు. పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం హాజరైన చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు



ద్విచక్రవాహనదారుడిని తనిఖీ చేస్తున్న ఎస్ఐ ఎం.షఫీ



క్రోసూరు ప్రధాన సెంటర్‌లో పోలీసు పికెట్

క్రోసూరు: ఈనెల 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పల్నాడు జిల్లాలో పలు గ్రామాల్లో జరిగిన ఘర్షణలు, దాడులు, హింస నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. అందులో భాగంగా క్రోసూరు మండలంలోని ఎర్రబాలెం, క్రోసూరు, దొడ్లేరు గ్రామాల్లో పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తూ ముమ్మర తనిఖీలు, అన్ని కూడళ్లలో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ ఎం.షఫీ ఆదివారం తెలిపారు. అదే విధంగా పెట్రోల్‌బంకుల్లో లూజుగా బాటిళ్లలో, క్యానుల్లో పెట్రోల్ పోయకూడదని, ఎవరైనా అలా తరలిస్తుండగా పట్టుబడితే పోలీసులు కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా అధికారుల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేవరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

పెదనెమలిపురిలో పోలీసు తనిఖీలు

రాజుపాలెం: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆదివారం పెదనెమలిపురిలో ఎస్ఐ అమీర్‌బాషా తన సిబ్బందితో గ్రామాలలో అనుమానాస్పదంగా ఉన్న గృహాలలో తనిఖీలు నిర్వహించారు. గేదెల కొట్టాలు, గడ్డి వాములలోనూ తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి మారణాయుధాలు దొరకలేదు. అనుమానితులను పిలిచి గ్రామాలలో అల్లర్లు సృష్టించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర గ్రామస్తులు అనుమానంగా గ్రామాలలో ప్రవేశించి తిరుగుతున్నట్లయితే పోలీసు వారికి తెలియజేయాలని చెప్పారు. సంబంధిత కాగితాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు.



పెదనెమలిపురిలో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచవరం: మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం నేడు సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తపాలెం, మాచవరం, గంగిరెడ్డిపాలెం, గాంధీనగర్, తురకపాలెం గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ డి.పెదమస్తాన్ తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలియజేశారు.

వ్యాపారాలకు అనుమతి

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకున్న అల్లర్లను నియంత్రించేందుకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 144 సెక్షన్ అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పట్టణంలో దుకాణాలన్నీ మూసి వేయడంతో ఇటు ప్రజలు ఇబ్బంది పడటంతో పాటు అటు వ్యాపారులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ క్రమంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆదివారం పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి పట్టణంలో యథాతథంగా వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. అయితే దుకాణాల్లో నలుగురికి మించి ఉంటే 144 సెక్షన్ నిబంధనలు అతిక్రమించినట్లు అవుతుందని, వ్యాపారులు, ప్రజలు ఇది గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. 144 సెక్షన్ అమలు నేపథ్యంలో శాంతి భద్రతలను సంరక్షించేందుకు సహకరించిన వ్యాపారులకు, ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వర్షంతో సేద తీరిన ప్రజలు

ముప్పాళ్ళ: ఆకాశం మేఘావృతం కావటంతో పాటుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో మండల వాసులకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించింది. ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని గంట పాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. పొలాల్లో సైతం వర్షం నీరు నిలిచిపోయింది. ఉక్కపోత, ఎండవేడిమితో అల్లాడుతున్న మండల వాసులకు కొంత ఉపశమనం లభించినట్లయింది. తొలకరి వ్యవసాయ పనులు ఆరంభించేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. పచ్చిరొట్ట ఎరువులు సాగుకు వర్షం ఎంతగానో దోహదపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైలు కిందపడి మతిస్థిమితం లేని మహిళ మృతి

పెదకూరపాడు: పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో పెదకూరపాడుకు చెందిన మతిస్థిమితం లేని వివాహిత సాయంత్రం ఐదు గంటల సమయంలో రైలింజన్ ఢీకొని మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకూరపాడు బీసీ కాలనీకి చెందిన దేవుళ్ళ దుర్గమ్మ (38)కు సత్తెనపల్లికి చెందిన టి.చిన్నయేసుతో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు కలరు. గత కొంత కాలం నుంచి మృతురాలు దుర్గమ్మ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో పెదకూరపాడులో నివాసం ఉంటున్న తల్లి కోటమ్మ వద్ద ఉంటోంది. గత రెండు రోజులుగా దుర్గమ్మ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులను, బంధువులను, భర్తను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో పెదకూరపాడు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పైన మృతదేహం కనిపించడంతో స్థానికులు దుర్గమ్మగా గుర్తించి గుంటూరు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా రైల్వే పోలీసులు మృతదేహాన్ని సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వినుకొండలో భారీ వర్షం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండలో ఈదురుగాలుతో కూడిన వర్షం పడింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు గంటసేపు భారీ వర్షం పడటంతో ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, ఫారెస్ట్ ఆఫీసు, శివయ్యస్థూపం సెంటర్ల వద్ద రహదారులపై నీటి నిల్వతో ప్రజలు అవస్థలు పడ్డారు. పాతమార్కెట్ బజారులో ఇసుకవాగు పొంగి ప్రవహించడంతో వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. శివారు కాలనీలైన ముట్లకుంట కాలనీ, రాజీవ్ రజక కాలనీ, వర్షపు నీరు నిబడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈదురుగాలలకు హోర్డింగ్‌లు, చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అలాగే వినుకొండ రూరల్ మండలంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్ సరఫరాకు సమయం పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



కంభంపాడులో తనిఖీలు నిర్వహిస్తున్న రూరల్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు తరువాత జరిగిన ఘర్షణలు నివారించేందుకు పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మండలంలోని కంభంపాడు, జమ్మలమడక, రాయవరం గ్రామాలలో పోలీసులు సోదాలు నిర్వహించారు. గ్రామాలలో ఎటువంటి అలజడులు, ఘర్షణలకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసులు గ్రామాలలోని కొట్టాలు, గడ్డివాములలో తనిఖీలు నిర్వహించారు. గ్రామస్తులకు ఎస్ఐ రాజశేఖర్ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఎన్నికలు అయిపోయాయని, ఏ పార్టీ గెలిచినా ప్రజలందరూ శాంతియుతంగా సోదర భావంతో కలిసి ఉండాలని, ఎవరైనా ఘర్షణలకు దిగుతూ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ అనంతరం ప్రత్యేక తనిఖీలు, బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు సిబ్బంది, స్పెషల్ పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

దాచేపల్లి : సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత పల్లెలు ప్రశాంతంగా ఉండాలని, ఇందుకు గ్రామస్తులంతా సహకరించాలని సీఐ ఎ.సురేంద్రబాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని నడికుడిలో ఆదివారం పోలీస్ కవాత్ చేపట్టి గ్రామస్తులతో మాట్లాడారు. వ్యక్తిగత కక్షలతో గ్రామాల్లో అలజడులు సృష్టించవద్దని, రాజకీయ పార్టీ నేతలు గ్రామాల్లో రెచ్చగొట్టేలా మాట్లాడినా.. ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అందరూ ఒకే కుటుంబ సభ్యుల్లా కలసిమెలసి ఉండాలని, పోలీసులకు ప్రజలు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి.సంధ్యారాణి తదితరులున్నారు.

పేర్ల మల్లయ్య మృతి బాధాకరం



పేర్ల మల్లయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు

మాచర్ల రూరల్: మండలంలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం విలువలతో కూడిన సేవా కార్యక్రమాలు చేస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పేర్ల మల్లయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందటం ఎంతో బాధాకరమని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పిన్నెల్లి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జమ్మలమడక గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పేర్ల అంకమ్మ తనయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పేర్ల మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో పేర్ల మల్లయ్య అందించిన సేవలు మరువలేమని, ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం అందించిన సేవలు ఎంతో విలువైనవన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, పోతిరెడ్డి కోటిరెడ్డి, ముక్కా గురవయ్య, గోపాల్‌రెడ్డి, గొబ్బూరి ఆదెయ్య, శ్రీనివాసరావు తదితరులున్నారు.

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

అమరావతి: మండల పరిధిలోని రైతులకు యాభై శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్నామని మండల వ్యవసాయశాఖ అధికారి అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు ప్రస్తుతం రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. మండలానికి జీలుగ 93 క్వింటాళ్లు, జనుము 30 క్వింటాళ్లు, పిల్లిపెసర 64 క్వింటాళ్లు కేటాయించారని తెలిపారు. జీలుగ, జనుము కిలో ధర రూ.88 ఉండగా యాభై శాతం సబ్సిడీపై 44 రూపాయలకే రైతులకు అందిస్తున్నామని తెలిపారు. అలాగే పిల్లిపెసర కిలో రూ.134 ఉండగా 67 రూపాయలకు ఇస్తున్నామన్నారు. పచిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. పచ్చిరొట్ట ఎరువు వేయడం ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలను భూమికి అందించగలుగుతామన్నారు. పిల్లిపెసర, జీలుగ, జనుము అలసంద వంటి పైర్లను పూమొగ్గ దశ వరకు పెంచి భూమిలో కలియదున్నితే త్వరగా చివుకుతాయన్నారు. ఈ పచ్చిరొట్ట పైరు ఆకులలో ఉన్న నత్రజని భూమిలో ఇంకి నత్రజని మొక్కలకు అందుతుందన్నారు. సుమారు 40 నుంచి 50 రోజులలో పూమొగ్గ దశకు రాగానే భూమిలో కలియదున్నటంతో భూమి సారవంతమై దిగుబడులు పెరుగుతాయన్నారు. వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు తప్పక పచిరొట్ట పంటను సాగు చేయాలన్నారు.

తప్పిన ప్రమాదం

యడ్లపాడు: మండలంలోని ఉప్పరపాలెంలో విద్యుత్ స్తంభం విరిగిపడటంతో పెను ప్రమాదం తప్పింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలోని నూతన చర్చి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఓ లారీ ప్రమాదవశాత్తు ఢీకొంది. విద్యుత్ సరఫరా ఉన్న స్తంభం మధ్యకు విరిగి కుప్పకూలింది. ఆ సమయంలో స్థానికులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరాను నిలుపుదల చేశారు. ఆదివారం గ్రామానికి విచ్చేసిన అధికారులు యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్తు పునరుద్ధరించారు.

మార్క్సిస్ట్ మహర్షి పుచ్చలపల్లి సుందరయ్య

- సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె చలమయ్య
- సత్తెనపల్లిలో పుచ్చలపల్లి 39వ వర్ధంతి సభ



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: మార్క్సిస్ట్ మహర్షి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీపీఎం నేత కట్ట శివ దుర్గారావు అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ మతోన్మాదం దేశానికి చాలా ప్రమాదకరమని ఆనాడే పీఎస్ తెలియ జెప్పారన్నారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, నియంతృత్వ విధానాలను ఎండగట్టాలన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని తెలియజెప్పిన ఆయన, తెలుగు మాట్లాడే వారంతా ఒక రాష్ట్రంగా ఉండాలని 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' అని పుస్తకం రాశారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని నీటి అవసరాన్ని గుర్తించిన ఆయన 'ఆంధ్రప్రదేశ్‌లో సమగ్ర నీటి పథకం' అని పుస్తకం రాశారన్నారు. నైజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని భూమి లేని పేదలకు భూ పంపిణీ చేశారన్నారు. కామ్రేడ్ సుందరయ్య చూపిన బాటలో మనమంతా పయనించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అన్నారు. న్యాయవాది పిన్నమనేని పాములయ్య మాట్లాడారు. ముందుగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సీపీఎం నాయకులు పొట్టి సూర్యప్రకాశరావు, గద్దె ఉమాశ్రీ, గుంటుపల్లి రజని, ఇంజం అరుణ, జడ రాజకుమార్, పంతంగి ప్రభాకర్, గడ్డం సుసులోన్, ఎం.హరిపోతురాజు తదితరులు ఉన్నారు.